సాక్షి బాపట్ల

బుధవారం । 4 । డిసెంబర్ । 2024



జెడ్పీ చైర్‌పర్సన్‌తో ఎమ్మెల్యే భేటీ

గుంటూరు ఎడ్యుకేషన్: అభివృద్ధి పనులపై నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మంగళవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినాతో చర్చించారు.



బాబు రాజేంద్రప్రసాద్‌కు నివాళి

నరసరావుపేట రూరల్: ప్రపంచ వికలాంగుల దినోత్సవం, బాబు రాజేంద్ర ప్రసాద్ జయంత్యుత్సవాన్ని కేసానుపల్లి జవహర్‌నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు.



పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు

బొల్లాపల్లి: రెడ్డిపాలెంలో పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సమష్టి దివ్య పూజా బలి నిర్వహించారు.

న్యూస్‌రీల్

నేడు నియోజకవర్గ సమన్వయకర్తల సమావేశం

బాపట్ల: వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం బుధవారం బాపట్లలో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక కోన చాంబర్‌లో ఈ సమావేశం ఉంటుందని ఆయన చెప్పారు. జిల్లా కమిటీల ఏర్పాటుపై ఈ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు.

పులిచింతల వద్ద ఆక్టోపస్ మాక్ డ్రిల్



అచ్చంపేట: తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు ప్రాంతం పులిచింతల ప్రాజెక్టుల వద్ద ఆర్గనైజేషన్ ఫర్ కౌంటర్ టెర్రరిస్ట్ ఆపరేషన్స్(ఆక్టోపస్) అధికారులు మంగళవారం రాత్రి మాక్ డ్రిల్ నిర్వహించారు. విపత్తులను ఎలా ఎదుర్కోవాలి, విధులు ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అడిషనల్ ఎస్పీ ఎ.రాజారెడ్డి టీం సభ్యులకు ప్రయోగాత్మకంగా వివరించారు. ముందుగా మాదిపాడులోని జెడ్పీ హైస్కూలులో టీమ్ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం పులిచింతల ప్రాజెక్టు వద్ద మాక్ డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాద సంస్థలు దాడులు నిర్వహించినప్పుడు ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆస్తులను, కట్టడాలను ఏవిధంగా రక్షించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో సుమారు 50 మందికి పైగా టీమ్ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ ఎ.ఎన్.రంగబాబు, ఆర్‌ఐస్ శ్రీకాంత్, శివప్రసాద్, రామచంద్రానాయక్, ఇరిగేషన్ ఏఈ, మెడికల్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది, అచ్చంపేట సీఐ వెంకటప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 1,902 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 150 , తూర్పు కెనాల్‌కు 45 , పశ్చిమ కెనాల్‌కు 80, నిజాంపట్నం కాలువకు 278 , కొమ్మమూరు కాలువకు 1293 క్యూసెక్కులు వదిలారు.

వెట్టి చాకిరి నుంచి కార్మికులకు విముక్తి



నగరంపాలెం: ఊరు కాని ఊరు.. తెలియని భాషతో వెట్టిచాకిరి చేస్తున్న వలస కార్మికులు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ చొరవతో ఎట్టకేలకు స్వస్థలాలకు చేరుకున్నారు. క్షేమంగా గుంటూరు చేరిన వారు జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో మంగళవారం జిల్లా ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండు నెలలు క్రితం గుంటూరు నగరంలోని శివనాగరాజు కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, మిర్చియార్డు ప్రాంతాల్లోని పది మందికిపైగా కార్మికులు తాపీ పనుల నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. ఆ పనులు ముగిశాక మహారాష్ట్రలోని బీడ్ జిల్లాలోని గెవ్రాయ్ గ్రామం చేరుకున్నారు. అక్కడ యజమాని డ్రైనేజీ పనులు చేయిస్తున్నాడు. తగిన వసతి కల్పించకుండా అర్ధాకలితో పనులు చేయించాడు. పారిపోయేందుకు ప్రయత్నించే వారిని కొట్టేవారు. ఎట్టకేలకు వారిలో ఒకరు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో జిల్లా ఎస్పీ దృష్టికి విషయం చేరింది. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా బృందం బాధితులను తీసుకొచ్చింది. రూ.93 వేల వేతనాన్ని కూడా యాజమాని నుంచి ఇప్పించారు. నగరంపాలెం పీఎస్ ఎస్ఐ బాషా, పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

అన్నదాతలను నిండా ముంచారు

జిల్లాలో కురుస్తున్న వర్షాలు సాకు చూపి ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిలిపివేసింది. ఇదే కారణంతో మిల్లర్లు ధాన్యం సేకరణకు స్వస్తి పలికారు. వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో 7 వేల ఎకరాల్లో వరి కోత కోసిన రైతులు ధాన్యం ఎక్కడ దాచుకోవాలో తెలియక ఆందోళన చెందుతున్నారు. చాలామంది రోడ్లపైనే ధాన్యం గుట్టలుగా పోసుకొని, వర్షానికి తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పుకొని పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేదు. ఎక్కువ రోజులు నిల్వ ఉంటే ధాన్యం పాడయ్యే అవకాశముంది. ఇదే జరిగితే రైతులకు తీవ్రనష్టం తప్పదు.



ధాన్యం రాశులపై పట్టలు వేసిన దృశ్యాలు

- ధాన్యం సేకరణ నిలిపి వేసిన ప్రభుత్వం
- 2.16 లక్షల ఎకరాల్లో వరిసాగు
- 7 వేల ఎకరాల్లో ముగిసిన కోతలు
- రోడ్లపైనే ధాన్యం
- వర్షానికి పట్టలు కప్పుకొని రైతుల పడిగాపులు
- ఆలస్యమైతే ధాన్యం దెబ్బతినే అవకాశం
- వేమూరు, రేపల్లె, బాపట్ల ప్రాంతాల్లో వరిపంటకు తీవ్ర నష్టం
- వర్షం దెబ్బకు 160 హెక్టార్లలో నేలవాలిన వరి
- ఆందోళనలో అన్నదాతలు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: ఫెంగల్ తుపాను ప్రభావంతో మూడు రోజులపాటు ఆకాశం మబ్బులతో నిండి చిరుజల్లులు కురిశాయి. అప్పటికే వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, చుండూరు, అమృతలూరు, భట్టిప్రోలు, కొల్లూరు ప్రాంతాలతోపాటు రేపల్లె ప్రాంతంలో రైతులు సుమారు 7 వేల ఎకరాల్లో వరిపంట కోత కోశారు. తుపాను ప్రభావం కనిపించడంతో చాలామంది రైతులు మిల్లర్లకు బస్తా రూ.1400 చొప్పున ధాన్యం విక్రయించారు. కొందరు రైతులు తక్కువ ధరకు ధాన్యం ఇచ్చేందుకు ఇష్టం లేక ఆరబెట్టి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు సిద్ధమయ్యారు. తీరా కోతలు జరిగేనాటికి వర్షం పెరగడంతో ఇళ్లలో దాచుకునే వసతి లేక ధాన్యాన్ని రోడ్ల పైనే కుప్పలుగా పోశారు. తడవకుండా ప్లాస్టిక్ పట్టలు కప్పుకొని పడిగాపులు కాస్తున్నారు.

వర్షం పెరగడంతో ఒకవైపు కోతలు నిలిచిపోగా అటు ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లు నిలిపి వేసింది. ఫెంగల్ తుపాను పోయినా సోమవారం నుంచి జిల్లాలో తిరిగి ఆ ప్రభావం మొదలైంది. కొన్ని ప్రాంతాల్లో మబ్బులతోపాటు చిరుజల్లులు కురవగా మంగళవారం రేపల్లె, వేమూరు, బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో ఒక మోస్తారు వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సగటున దాదాపు సెంటీమీటర్ వర్షం కురిసింది. ఆకాశం మబ్బులతో నిండుకుంది.

భట్టిప్రోలు మండలంలోని పెదపులివర్రు, భట్టిప్రోలు, సూరేపల్లి, కోనేటిపురం, పల్లికోన రైతులు రోడ్లపైనే ధాన్యాన్ని ఉంచుకొని పడిగాపులు కాస్తూ కనిపించారు. వర్షం వల్ల ధాన్యాన్ని ఆరబెట్టుకునే పరిస్థితి లేదని, రెండు మూడు రోజులు ఇలాగే ఉంటే ధాన్యం పాడై పోతుందని వారు ఆందోళన చెందుతున్నారు. తక్కువ ధరకైనా అమ్ముకుందామంటే అటు మిల్లర్లు ధాన్యాన్ని కొనడంలేదు. దీంతో ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు లబోదిబోమంటున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో 160 హెక్టార్లలో కోత దశలో ఉన్న వరిపంట నేలవాలింది. మరికొంత వర్షం కురిస్తే మొత్తంపంట నేలకొరిగి ధాన్యం నేలపాలయ్యే ప్రమాదముంది.



వర్షానికి తడిచిన వడ్లు

ఆంక్షలతో అవస్థలు

జిల్లా వ్యాప్తంగా 151 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా ఇప్పటివరకు వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో రెండు వేల టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నా ఆ స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయలేదు. మరోవైపు తేమశాతాన్ని 17 నుంచి 22 శాతానికి పెంచినట్లు ప్రభుత్వం ప్రకటించినా 17 తేమశాతం తర్వాత ఒక్కొక పాయింట్ తేమశాతానికి ఒక్క కిలో చొప్పున అదనంగా ధాన్యాన్ని తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించడంతో అన్నదాతులు తీవ్రంగా నష్టపోనున్నారు. ప్రభుత్వం ఆంక్షలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ధాన్యం కొనేవారు లేరు



ఈ సీజన్‌లో 13 ఎకరాలు సాగుచేశా. వర్షానికి భయపడి హార్వెస్ట్ ద్వారా కోత కోయించా. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు నిలిపివేసింది. మూడు రోజులుగా ధాన్యం కాపాడుకునేందుకు నానా తిప్పలు పడుతున్నా. ప్రభుత్వం గిట్టుబాటు ధర ఇస్తామని చెబుతూ పలురకాల ఆంక్షలు విధించి ఇబ్బంది పెడుతోంది. ధాన్యం అమ్మినా డబ్బులు ఎప్పుడు పడతాయో తెలియడంలేదు.

– జంపని తులసి రాంచరణ్, కోడిపర్రు, భట్టిప్రోలు మండలం.



వర్షానికి తడిచిన వరి పనలు



వేమూరులో రోడ్డుపై ధాన్యం ఆరబోసి పట్టలు కప్పి చెట్ల కొమ్మలు పెట్టిన రైతులు




భట్టిప్రోలు మండలం పెద పులివర్రు వద్ద వర్షానికి నేలవాలిన వరిపైరు

ఎక్కడి ఇటుక అక్కడే

- అమ్ముడుపోని గతేడాది ఉత్పత్తిచేసిన ఇటుక
- భారీగా పతనమైన ఇటుక ధరలు
- పెట్టుబడుల కోసం ఉత్పత్తిదారుల పాట్లు
- కొన్ని బట్టీలలో తొలగని వరద నీరు
- ఇటుక ఉత్పత్తి నెలన్నర వెనక్కి

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాణ్యమైన ఇటుకల తయారీకి కొల్లూరు ప్రసిద్ధి. కొల్లూరు ఇటుక పరిశ్రమ నేడు సంక్షోభం ఎదుర్కొంటుంది. కృష్ణానదికి ఇటీవల వచ్చిన వరదల కారణంగా తయారీదారులు తీవ్రంగా నష్టపోయిన విషయం విదితమే. మిగిలిన ఇటుక కూడా అమ్ముడుపోక బట్టీల్లోనే ఉంది. దీంతో కొత్తగా ఇటుక తయారీకి ఎవ్వరూ ముందుకు రావడం లేదు.



కొల్లూరు కరకట్ట సమీపంలో అమ్ముడు పోకుండా మిగిలిపోయిన ఇటుక

కొల్లూరు : కొల్లూరు మండలం కొల్లూరు, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పెసర్లంక, దోనేపూడి, తోకలవారిపాలెం, తురకపాలెం, తిప్పలకట్ట, పోతార్లంక పరిధిలో ఇటుక పరిశ్రమ కొనసాగుతుంది. నవంబర్ నెల చివరి నుంచి ఇటుక ఉత్పత్తికి పరిశ్రమదారులు తెరతీయడం ఆనవాయితీ. ప్రతి ఏటా ఐదు నెలలు కొనసాగే వ్యాపారంలో సుమారు 30 కోట్ల వరకు ఇటుక రాయిని ఉత్పత్తి చేయడం పరిపాటిగా వస్తుంది. తిరిగి పరిశ్రమ ఆరంభమయ్యే నాటికి ఇటుక అమ్మకాలు పూర్తిచేసుకొని కొత్త ఇటుక ఉత్పత్తికి ఉత్పత్తిదారులు సమాయత్తమవుతారు. ఇటీవల కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా ముడి సరుకైన మట్టి, ఊక, బొగ్గు నష్టపోయారు. అంతేగాక గతేడాది ఉత్పత్తి చేసిన కోట్లాది ఇటుక అమ్ముడుపోకుండా ఎక్కడికక్కడ బట్టీల్లోనే ఉండిపోయింది. ఫలితంగా పెట్టుబడులు స్తంభించిపోయాయి. నిర్వాహకులు కష్టాలను ఎదుర్కొంటున్నారు. దీంతో ఈ ఏడాది కొత్తగా ఇటుక తయారు చేసేందుకు ఎవ్వరూ సాహసించడం లేదు. దీంతో పరిశ్రమ పూర్తిస్థాయిలో ఏర్పడటానికి డిసెంబర్ ఆఖరు వరకు సమయం పట్టే సూచనలున్నట్లు ఉత్పత్తిదారులు అభిప్రాయపడుతున్నారు.

ధరలు భారీగా పతనం

ఇటుక అమ్మకాలు పూర్తిగా తగ్గిపోవడంతో ధరలు భారీగా పతనమయ్యాయి. గతంలో ఒక్కొక్క ఇటుక ధర రూ.6 నుంచి రూ.6.50 పలకగా నేడు రూ.5 నుంచి రూ.5.20కి పడిపోయింది. బట్టీలలో ఇటుక ఎక్కడికక్కడ మిగిలిపోవడంతోపాటు కొత్త ఇటుక తయారీ పెట్టుబడులు లేకపోవడంతో అయినకాడికి అమ్ముకోవడానికి సిద్ధపడుతున్నారు.

అమ్మకాలు తగ్గడంతో నష్టం



గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మకాలు తగ్గిపోవడం పరిశ్రమ నిర్వాహకులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెట్టుబడులు తిరిగి చేతికి రాని కారణంగా తిరిగి పెట్టుబడులు పెట్టాలంటే ఉత్పత్తిదారుల చేతిలో డబ్బు లేని పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం పేదలు నిర్మించుకునే పక్కా గృహాలకు నిధులు మంజూరు చేసిన పక్షంలో ఇటుక అమ్మకాలు ఊపందుకునే అవకాశం ఉంటుంది.

– ఘంటా శివరంగారావు, ఇటుక ఉత్పత్తిదారుడు, కొల్లూరు.

కళ్లముందే ఇటుక



గతేడాది ఉత్పత్తి చేసిన ఇటుక మొత్తం అమ్ముడుపోకుండా కళ్లముందే ఉంది. ధరలు తగ్గిపోవడంతో పెట్టిన పెట్టుబడులు చేతికందే పరిస్థితి లేక నష్టాలు వచ్చాయి. గత సీజన్‌లో ఉత్పత్తిచేసిన ఇటుక అమ్మకాలు చేపట్టాలంటే తలప్రాణం తోకకు వస్తున్న తరుణంలో పరిశ్రమ నిర్వహణే ప్రశ్నార్థకంగా మారింది.

– కొల్లూరు మాధవరావు, ఇటుక ఉత్పత్తిదారుడు, కొల్లూరు

సీఎం పర్యటనను జయప్రదం చేయండి

- కలెక్టర్ జె.వెంకట మురళి
- అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల : ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనను జయప్రదం చేసేందుకు అధికారులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అన్నారు. ముఖ్యమంత్రి పర్యటనపై జిల్లా అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అధికారులు తమకు కేటాయించిన బాధ్యతలు సమర్థంగా నిర్వర్తించాలని అన్నారు. మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు విద్యార్థుల తల్లిదండ్రులను ఘనంగా ఆహ్వానించే ప్రక్రియను ఐదో తేదీన ప్రారంభించాలన్నారు. హెలిప్యాడ్ ప్రాంగణానికి ప్రతిష్టమైన భద్రత కల్పించాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అర్జీలను వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి అర్జీని అధికారులు నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అమలు తీరుపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం వీక్షణ సమావేశం ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసిన అర్జీలకు అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో జి గంగాధర్‌గౌడ్, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు పి గ్లోరియా, చంద్రశేఖర్, రామలక్ష్మి, జిల్లా అధికారులు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గృహ ప్రవేశ కార్యక్రమాలు చేపట్టాలి

రాష్ట్రంలో లక్ష గృహాల గృహప్రవేశం కార్యక్రమంలో భాగంగా జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. గృహప్రవేశాలపై మండల ప్రత్యేక అధికారులు, మండల స్థాయి అధికారులతో మంగళవారం కలెక్టర్ సమీక్షించారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ పి పద్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం అనంతరాజు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయండి

జిల్లా వ్యాప్తంగా ఈనెల 9 నుంచి జనవరి 5వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. రెవెన్యూ అంశాలపై తహసీల్దార్లతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో తప్పనిసరిగా పర్యటించాలన్నారు. రెవెన్యూ దస్త్రాలలో వివరాలు లేవని ప్రజలను వెనుకకు పంపడం ఏమిటని, వాటిపై వస్తున్న ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూములను తహసీల్దార్లు పునఃపరిశీలన చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వారంలోగా దస్త్రాలన్నీ పరిశీలించి నివేదిక పంపాలన్నారు. శాసనమండలి ఎన్నికల నిర్వహణకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు.

ఆన్‌లైన్ చేయాలి

నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించిన భూముల వివరాలను ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని జేసీ ప్రఖర్ జైన్ తెలిపారు. 3,900 ఎకరాల భూముల వివరాలు ప్రాధాన్యత క్రమంలో అప్‌లోడ్ చేయాలన్నారు.

కోడి పోరు.. జన హోరు

- రణక్షేత్రంలో ఉత్సాహం
- కొనసాగుతున్న వీరారాధన ఉత్సవాలు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు బ్రహ్మానందరెడ్డి, వెలిగండ్ల రాము



కోడి పుంజులను పోటీకి వదులుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే రాము

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ప్రధానమైన కోడిపోరు మంగళవారం జరిగింది. తెల్లవారు జామున వీరుల గుడిలో పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ, వీరాచారులు కోడిపోరును ప్రదర్శించారు. ముందుగా వీర విద్యావంతులు కోడిపోరు కథాగానం చేశారు. అలనాడు బ్రహ్మనాయుడు, నాయకురాలు నాగమ్మల మధ్య జరిగిన కోడిపోరు తీరును వర్ణించారు. కథాగానం మధ్యనే పీఠాధిపతి చెన్నకేశవ బ్రహ్మనాయుడు పుంజు చిట్టిమల్లును, వీరాచార యువతి నాయకురాలు పుంజు శివంగి డేగను పోటీకి వదిలారు. తొలి రెండు పందేలలో బ్రహ్మనాయుడు పుంజు చేతిలో నాగమ్మ శివంగి డేగ ఓడిందని ప్రకటించారు. అనంతరం మలి పందేనికి నాయకురాలు ఉసికొల్పుతుందని, మాచర్ల, గురజాల రాజులు మలిదేవుడు, నలగామరాజులూ సై అంటారని వీరవిద్యావంతులు వివరించారు. ఓడినవారు రాజ్యం వదలి ఏడేళ్లు అరణ్యవాసం చేయాలనే షరతుతో ఈ మలి పందెం జరుగుతుందని, ఆ పందెంలో నాయకురాలు మాయోపాయంతో గెలుస్తుందని పందేలకు అలరాజు న్యాయనిర్ణేతగా వ్యవహరించారని కథకులు పేర్కొన్నారు. బ్రహ్మనాయుడు పందెంలో ఓడార ని అలరాజు ప్రకటించడంతో మలిదేవరాజు పరివారం ఏడేళ్ల అరణ్యవాసానికి తరలారని పేర్కొన్నారు.

వేడుకగా కోడిపోరు

ఆ తర్వాత కోడిపోరును ఎమ్మెల్యేలు వేడుకగా నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి బ్రహ్మనాయుడు పుంజుతో, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నాయకురాలు పుంజుతో పందేలు వేశారు. కార్యక్రమానికి ప్రభుత్వ చీఫ్‌విప్ జీవి ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

వీరుల దీవెనలందుకున్న ప్రజలు

ఇదిలా ఉంటే కోడిపోరు నాడు ప్రజలు భారీగా తరలివచ్చి వీరుల గుడిలో పల్నాటి వీరుల ఆయుధాలను దర్శించుకున్నారు. గ్రామోత్సవానికి వచ్చిన వీరుల ఆయుధాల ఆశీస్సులను ప్రజలు పొందారు. చిన్నారులకూ వీరుల దీవెనలందించారు. ఇదిలా ఉంటే వీరాచారులు పొంగళ్లు చేసుకుని తమ తమ కొణతాలతో ఊరేగింపుగా తరలివెళ్లి చెన్నకేశవస్వామికి అంకాలమ్మకు భారీగా బోనాలు సమర్పించారు. వీరాచారులు చాలా మంది గంగధారి మడుగు ఒడ్డున తలనీలాలు సమర్పించారు. చాలా మంది ఆచారవంతులు ఈ రోజు కూడా రణక్షేత్రానికి తరలివచ్చి తమ ఆచారాన్ని నెరవేర్చుకున్నారు. ఎక్కడ చూసినా కోడి పుంజులు, గొర్రె పొట్టేళ్లు కనిపించాయి. మధ్యాహ్నం వర్షం పడడంతో వీరాచారులు ఇబ్బందులు పడ్డారు. బుధవారం జరగనున్న కళ్లిపాడు ఘట్టంతో ఐదు రోజుల ఉత్సవాలు ముగియనున్నాయి.

బంధమే బరువై.. ముదిమిలో ఒంటరై..

- నడిరోడ్డుపై వృద్ధుడిని వదిలేసిన కుటుంబం
- స్థానికుల సమాచారంతో ఆదుకున్న పోలీసులు



బాధితుడు

మంగళగిరి: ఒకవైపు చలి గజగజలాడిస్తోంది.. మరోవైపు మీద పడిన వయస్సులో నిలబడలేని పరిస్థితి.. దీనికంతటికీ కారణం ఆయన్ను బరువుగా భావించిన కుటుంబసభ్యులే. కని పెంచారనే ప్రేమ లేదు.. కనీసం మానవత్వంతోనైనా కనికరించనూ లేదు. ఆదివారం ఉదయం నగర పరిధిలోని పెదవడ్లపూడిలో ప్రార్థనలకు వెళ్తున్న ప్రకాష్ అనే యువకుడు రోడ్డుపై చలిలో వణుకుతూ కనిపించిన వృద్ధుడిని గమనించి చలించిపోయారు. ఆయనకు తాగునీరు అందించి, వివరాలు కనుక్కునేందుకు యత్నించారు. సరిగా మాట్లాడలేక పోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. 108 వాహనానికి ఫోను చేశారు. తనను ఎవరో ఆటోలో తీసుకువచ్చి ఇక్కడ వదిలేసి వెళ్లారని వృద్ధుడు తెలిపారు. విజయవాడ మల్లికార్జునపేటలో నివాసం ఉంటానని పేర్కొన్నారు. రూరల్ పోలీసులు అక్కడికి చేరుకుని ఆయన్ను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి, చికిత్స చేయిస్తున్నారు.

వేటపాలెంలో లేడీ డాన్ల హల్‌చల్

● అధిక వడ్డీలతో పేద, మధ్యతరగతి కుటుంబాల టార్గెట్
● అప్పు తీర్చడం ఆలస్యమైతే ఇంటికొచ్చి వేధింపులు
● దాడికి పాల్పడుతున్న లేడీ డాన్లు
● వీరికి అండగా పోలీసులు
● ఎదురుతిరిగే వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెడతామని బెదిరింపులు

కాలం మారింది గురూ.. ఎక్కడైనా పురుషులు డాన్లు, రౌడీలను చూస్తుంటాం. కానీ ఇప్పుడున్న ప్రపంచంలో లేడీ డాన్లను కూడా చూస్తున్నాం. పురుషులకు తగ్గట్లు ఏమాత్రం మేం తగ్గేదే..లా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అంతేకాదు ఎదురు తిరిగారా అంతేసంగతులు..

వేటపాలెం: వేటపాలెం మండలంలో లేడీ డాన్ల సంఖ్య పెరిగిపోయింది. వీరి ఆగడాలతో పేద, మధ్యతరగతి కుటుంబాల పరువు బజారునపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే కోరికతో కొంత మంది మహిళలు వడ్డీ వ్యాపారం ఎంచుకున్నారు. పేద, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను గుర్తించి వారిని టార్గెట్ చేస్తున్నారు. మొదట్లో మంచి మాటలతో వారికి కొంత మొత్తంలో నగదు అప్పుగా ఇస్తారు. ఇచ్చిన నగదుకు రూ.10 వడ్డీగా చెప్తారు. ఇచ్చిన మొత్తం నగదులో వడ్డీ పట్టుకొని మిగతా డబ్బులు ఇస్తారు. ఇచ్చిన అప్పును కిస్తీల రూపంలో ప్రతిరోజూ కొంత మొత్తంగా నగదు చెల్లించేలా అవగాహన కుదుర్చుకుంటారు. ప్రతి రోజూ రాత్రి సమయంలో వచ్చి నగదు వసూలు చేసుకొని వెళ్తుంటారు. ఇది వారి నిత్యం వడ్డీ వ్యాపారం తీరు తెన్నులు.

వేధింపులు, దౌర్జన్యాలు..

నాయినపల్లి (చెక్కలంప)కి చెందిన ఐదుగురు మహిళలు ఒక జట్టుగా ఏర్పడ్డారు. వీరు కష్టపడకుండా డబ్బులు సంపాదించాలని ఆలోచించారు. దీనికి కార్యరూపం సృష్టించుకొన్నారు. వీరు ఐదుగురు కలసి రూ.2 వడ్డీకి నగదు ఇచ్చేవారి వద్ద అవగాహన కుదుర్చుకున్నారు. వారి వద్ద నుంచి కొంత మొత్తంలో రూ. 2 చొప్పున వడ్డీకి నగదు తీసుకుంటారు. ఈ తీసుకున్న నగదును నాయినపల్లిలో ఇతర ప్రాంతాల్లో ఉన్న పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళ అవసరాలను గుర్తించి వారికి రూ.10 చొప్పున వడ్డీకి ఇస్తారు. అప్పు తీసుకున్న వారికి కూలి పనులు సక్రమంగా లేకపోవడంతో అప్పు చెల్లించలేదు. దీంతో వారి ఇంటికి వెళ్లి వేధింపులకు పాల్పడతారు లేడీ డాన్లు. అప్పు చెల్లించలేకపోతే మీ ఇంట్లో వయస్సు కొచ్చిన కూతురి చేత వ్యభిచారం చేయించి మాకు కట్టాల్సిన అప్పు చెల్లించాలని బూతులు తిడుతుంటారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తుంటారు. ఎవరైనా ఎదురు



తిరిగితే వారిపై దాడికి వెనకాడటం లేదు.

లేడీ డాన్‌లకు ఓ పోలీసు అండ

ఈ లేడీ డాన్‌లకు పోలీసుస్టేషన్‌లో ఒక కానిస్టేబుల్ అండగా ఉంటున్నాడు. ఇతను ఈ ఐదుగురు లేడీ డాన్‌లలో ఒక మహిళతో వివాహేతర సంబంధం కొనసాగుతోంది. ఈ మేరకు రుణాలు తీసుకున్న కుటుంబాలను ఈ కానిస్టేబుల్‌ను బూచిగా చూపి బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఈ ఐదుగురు మహిళల్లో ఒక మహిళ కొంత కాలం కిందట వేటపాలెం నుంచి ఢిల్లీ ప్రాంతాల్లోని వ్యభిచార గృహలకు మహిళను విక్రయించిన కేసులో ముద్దాయిగా ఉండేది. సార్వత్రిక ఎన్నికలకు ముందు ఈ లేడీ డాన్‌ల ఆగడాలతో ఇబ్బందులకు గురైన కొందరు మహిళలు వేటపాలెం పోలీసు స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేశారు.అప్పటిలో మహిళలకు అండగా ఉన్న కానిస్టేబుల్ స్టేషన్‌కి సంబంధించిన అన్ని సెటిల్‌మెంట్‌లు నగదు లావాదేవీలు అతనే చూస్తుండేవాడు. వేధింపులతో స్టేషన్‌కి వచ్చిన మహిళలను ఎస్సైతో చెప్పి బెదిరించి అప్పు తీసుకొన్నప్పుడు చెల్లించాలి.. లేని పక్షంలో వారి అలానా ప్రవర్తిస్తారని ఫిర్యాదుదారులనే మందలించి పంపించేలా చేశాడు. ప్రస్తుతం వారి అరాచకాలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి.

దేశాయిపేట ప్రాంతంలో..

దేశాయిపేట పంచాయతీ ఆర్‌టీసీ పెట్రోలు బంకు ప్రాంతంలో ఇద్దరు మహిళలు ఇదే పంథా ఎంచుకొన్నారు. వీరి అధిక వడ్డీలకు నగదు ఇవ్వడం.. తిరిగి నగదు ఆలస్యం అయినా ఎదురు మాట్లాడిన వారిపై ఎస్టీ,ఎస్సీ కేసులు పెడతమాని బెదిరింపులకు పాల్పడుతున్నారని బాధితులు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నత అధికారులు విచారణ చేసి చర్యలు తీసుకోవాలని బాధిత కుటుంబాలు కోరుతున్నాయి.

రిటైర్డ్ ప్రొఫెసర్‌కు సైబర్ వల

● రూ.74 లక్షలు మాయం
● పోలీసులకు ఫిర్యాదు

చుండూరు(వేమూరు): చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ గొంది లక్ష్మీహరివరప్రసాద్‌ను సైబర్ నేరస్తులు మోసం చేసి వారి అకౌంట్‌లో రూ.74 లక్షలు జమ చేయించుకున్నట్లు ఎస్ఐ షేక్ రహమాన్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు..చుండూరు మండలం వేటపాలెం గ్రామానికి చెందిన గొంది లక్ష్మీహరి వరప్రసాద్ కేరళ రాష్ట్రంలో ప్రొఫెసర్‌గా పనిచేశాడు. రిటైర్ అయిన తర్వాత స్వగ్రామైన వేటపాలెంలో నివాసం ఉంటున్నాడు. సైబర్ నేరస్తులు ఫోన్ చేసి మీ అకౌంట్‌లో రూ.6 కోట్లు జమ అయ్యాయని, మనీ లాండ్రింగ్ కింద కేసు నమోదైందని, సుప్రీంకోర్టులో కేసు ఉంది, కేసు మాఫీ చేయాలంటే మా అకౌంట్‌లో డబ్బులు జమ చేయాలని కోరారు. దీంతో ఆయన భయపడి వారి అకౌంట్‌కు రూ.74 లక్షలు పంపించాడు. మరలా ఫోన్ చేసిన రూ.30 లక్షలు అకౌంట్‌లో జమ చేయాలని కోరారు. అనుమానం రావడంతో ఆయన విదేశాలలో ఉంటున్న తన కుమార్తెకు విషయం తెలియజేశాడు. వెంటనే కేసు పెట్టమని ఆమె సూచించడంతో చుండూరు పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. సైబర్ నేరస్తులపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ షేక్ రహిమాన్ తెలిపారు.

క్లుప్తంగా

ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలి

జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు



నగరం: మద్యం షాపు నిర్వాహకులు ఎక్సైజ్ చట్టాలను విధిగా పాటించాలని ఎటువంటి తప్పిదాలు చేసినా కఠిన చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన తనిఖీ చేసి పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం స్టేషన్ పరిధిలోని మద్యం షాపు నిర్వాహకులతో సమావేశం నిర్వహిచారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టాలకు అనుగుణంగా మద్యం షాపులను నడపాలన్నారు. ఎమ్మార్పీకే మద్యం విక్రయాలు జరపాలన్నారు. బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో సీఐ మారుతి శ్రీరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్



రేపల్లె రూరల్: మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 మున్సిపాలిటీలలో పలు ఇంజినీరింగ్ విభాగాలలో సుమారు 13వేల మంది కార్మికులు 20 నుంచి 25 ఏళ్లగా పనిచేస్తున్నారన్నారు. వీరికి 2018 సంవత్సరం వరకు పారిశుద్ధ్య కార్మికులతో పాటు సమానంగా జీతాలు చెల్లించారని, ప్రస్తుతం పారిశుద్ధ్య కార్మికుల కంటే తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగటంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మున్సిపల్ పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. ప్రమాదకరమైన పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ చెల్లించాలని, పనిచేసేందుకు అవసరమైన పనిముట్లు, కిట్లు, సకాలంలో అందించాలని, వాహనాల మరమ్మతుల భారాన్ని కార్మికులపై నెట్టివేసే ధోరణి మారాలన్నారు. అనంతరం కమిషనర్ సాంబశివరావుకు వినతి పత్రం అందజేశారు. రేపల్లె మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు, కార్యదర్శి ఎస్.రవిబాబు, శివ, రవి, రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల పట్ల ప్రత్యేక దృష్టి

● ఈ విద్యాసంవత్సరంలో రూ.55.08 లక్షల అలివెన్స్‌లు మంజూరు
● భవిత కేంద్రాల ద్వారా విభిన్న ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ
● సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న



రేపల్లె రూరల్: విభిన్న ప్రతిభావంతుల పట్ల జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక దృష్టి సారించినట్లు సహిత విద్య జిల్లా కో–ఆర్డినేటర్ మట్టా జ్యోత్స్న అన్నారు. పట్టణంలోని భవిత కేంద్రంలో ఆమె మంగళవారం మాట్లాడారు. 2025–25 విద్యా సంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా 759 మందిని కొత్తగా విభిన్న ప్రతిభావంతుల్ని (ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు) గుర్తించామని, దీంతో జిల్లా వ్యాప్తంగా ఈ సంఖ్య 3,309కి చేరిందని చెప్పారు. జిల్లాలో 25 భవిత కేంద్రాలు ఉండగా వీటిలో 527 మంది చిన్నారులు సేవలు పొందారన్నారు. ప్రతి కేంద్రంలో ఇరువురు స్పెషల్ ఎడ్యుకేటర్‌లు, ఫిజియో థెరపిస్ట్, ప్రత్యేక సిబ్బందితో విభిన్న ప్రతిభావంతులకు తర్ఫీదునిస్తున్నామన్నారు. సాధారణ విద్యార్థులతో కలిపే వీరికి బోధన జరుగుతుందని, ఇదే సహిత విద్య లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వం అందించే పథకాలకు అర్హత ఉండాలంటే యూడీఐడీ కార్డులు తప్పనిసరి అని, కార్డులు లేనివారు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. సదరన్ సర్టిఫికెట్‌లు కలిగి ఉండాలన్నారు. ఈ సంవత్సరం విభిన్న ప్రతిభావంతులకు రూ.55.08 లక్షలు అలవెన్స్‌లు విడుదల అయ్యాయన్నారు. హోమ్ బేస్డ్ చిన్నారులు 250 మందికి ఒక్కొక్కరికి రూ.3వేలు చొప్పున రూ.7.50 లక్షలు మంజూరయ్యాయన్నారు. రవాణా చార్జీల కోసం ఇంటి వద్ద నుంచి కేంద్రానికి వచ్చే 1 నుంచి 8 చదివే 288 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.8.64 లక్షలు, 9 నుంచి 12వ తరగతి చదివే 186 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున 5.58 లక్షలు, ఎస్కార్టు అలెవెన్స్ కింద ప్రైమరీ విద్యార్థులు 249 మందికి ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.7.47 లక్షలు, 149 మంది సెకండరీ విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.3 వేల చొప్పున రూ.4.47 లక్షలు మంజూరయ్యాయన్నారు.

గాల్స్ స్టైఫండ్‌కు ఎలిమెంటరీ బాలికలు 763 మందికి రూ.15.60 లక్షలు, సెకండరీ బాలికలు 308 మందికి రూ.6.16 లక్షలు మంజూరైనట్లు పేర్కొన్నారు. అలవెన్స్‌లు వీరి ఖాతాలలో త్వరితగతిన జమ చేస్తామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను భవిత సెంటర్లకు పంపి వారి భవితవ్యంకు బంగారు బాటలు వేయాలని కోరారు.

జాతీయస్థాయిలో కర్లపాలెం కానిస్టేబుల్ ప్రతిభ

● పెన్‌కాక్ సిలాట్‌లో కాంస్య పతకం
● కానిస్టేబుల్‌ను అభినందించిన ఎస్పీ తుషార్ డూడీ



కానిస్టేబుల్ నరేంద్రను అభినందిస్తున్న ఎస్పీ

బాపట్లటౌన్: క్రీడలు శరీర సౌష్టవంతోపాటు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయని ఎస్పీ తుషార్ డూడీ తెలిపారు. శ్రీనగర్‌లోని ఇండోర్ స్పోర్ట్స్ స్టేడియం నవంబర్ 19 నుంచి 21 వ తేది వరకు జరిగిన సెకండ్ ఆల్ ఇండియా పెన్ కాక్ సిలాట్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. పోటీల్లో వివిధ విభాగాల నుంచి సుమారు 1200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. బాపట్ల జిల్లా కర్లపాలెం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించే వీరంకి నరేంద్ర పెన్ కాక్ సిలాట్ ఎబోవ్ 110 విభాగంలో పోటీ పడి కాంస్య పతకం సాధించారన్నారు. జాతీయ స్థాయిలో జిల్లా పోలీస్ శాఖ ఖ్యాతిని చాటిన నరేంద్రను మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అభినందించి సత్కరించి మెమెంటో అందజేశారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లా ఖ్యాతిని జాతీయ స్థాయిలో ఇనుమడింప చేయడం అభినందనీయమన్నారు. రాబోయే రోజుల్లో మంచి తర్ఫీదు పొంది అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలన్నారు.

8న పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు

తెనాలి: సీపీఐ శత వార్షికోత్సవాల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఈ నెల 8న గుంటూరులో యువతకు పాటలు, ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించనున్నారు. గుంటూరు కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్లో ఉదయం 10 గంటల నుంచి ఈ పోటీలు ఉంటాయని ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు వెల్లడించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన కళాకారుల సమావేశంలో వారు మాట్లాడారు. కళలు, సాహిత్యంపై అభిరుచి కలిగిన యువతరాన్ని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆశ వర్కర్‌ను హింసిస్తున్న సచివాలయ ఏఎన్‌ఎం

ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన ఆశ వర్కర్లు



డాక్టర్ శివచెన్నయ్య వద్ద తన సమస్యను తెలియజేస్తున్న ఆశ వర్కరు బేబి

జే.పంగులూరు: ఆశ వర్కర్‌ను సచివాలయ ఏఎన్‌ఎం వేధింపులకు గురిచేస్తోందని ఆశ వర్కర్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని కొండమంజులూరు గ్రామానికి చెందిన కొలకలూరు బేబీ సచివాలయంలో ఆశ వర్కర్‌గా పనిచేస్తోంది. అదే సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న జయమ్మ తనను మానసికంగా, శారీరకంగా హింసిస్తోందని మంగళవారం డాక్టర్ శివచెన్నయ్యకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు బేబీ మాట్లాడుతూ 2020 నుంచి సచివాలయంలో ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న జయమ్మ నాతో ఇంటి పని కూడా చేయించుకునేదని, డ్యూటీకి వచ్చినా సరిగా రాలేదని మానసికంగా హింసించేదని తెలిపింది. 12 ఏళ్ల నుంచి మొదటిలో జీతం లేకున్నా పనిచేశానని తెలిపింది. ప్రస్తుతం ఉన్న ఏఎన్‌ఎం నీకు పనిసరిగా రాదని, నాపై దుర్భాషలాడేది. ఒక్కోసారి నాపై దాడి కూడా చేసేదని వాపోయింది. ఆమెకు వత్తాసుగా హెచ్‌వీ రమాదేవి కూడా నాపై దుర్భాషలాడేదని, ఆశ వర్కర్‌గా మానేసి ఇంటి వద్ద కూర్చో అని ఒత్తిడి తెచ్చే వారని తెలిపింది. నన్ను మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెట్టిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయాలని బాధితురాలు తెలిపింది.

ఆశ వర్కర్ల డిమాండ్..

ఏఎన్‌ఎంగా పనిచేస్తున్న జయమ్మ ఆశ వర్కరు బేబీ అసభ్య పదజాలంతో దూషిస్తూ చేయిచేసుకోవడం దారుణమన్నారు. దివ్యాంగురాలని కూడా చూడకుండా ఇంటి పనిచేయించుకోవటం, లేకుంటే దూషించటం చాలా బాధాకరమైన విషయం అని అన్నారు. డ్యూటీకి వచ్చినా రాలేదని ఇష్టానుసారంగా చేసిన ఏఎన్‌ఎంను శాఖపరంగా చర్యలు తీసుకొని ఆశ వర్కర్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈవిషయమై ఏఎన్‌ఎం జయమ్మను వివరణ కోరగా ఆశ వర్కర్ బేబీ చెప్పున్న ఆరోపణలు అవాస్తవం. ఆమెకు పని రాకపోతే నేనే నేర్పించాను. మా ఇంట్లో ఆమె పనికి రాలేదు. నేను దాడి చేయలేదు. ఇదంతా అవాస్తవమని చెప్పింది.

ఉన్నతాధికారులకు తెలియజేస్తా..

ఆశావర్కరు, సచివాలయ ఏఎన్‌ఎంల మధ్య జరుగుతున్న వివాదాన్ని పరిశీలిస్తున్నాం. వారి ఇద్దరి సమస్యలు తెలుసుకొని సమాచారం ఉన్నతాధికారులు దృష్టికి తీసుకుపోతాం.

– శివచెన్నయ్య, డాక్టర్

అంతర్రాష్ట్ర నేరగాడు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

● తక్కువ సమయంలో కేసు ఛేదించిన పోలీసులు
● వివిధ జిల్లాల్లో చోరీ చేసిన సొత్తు రూ.18.48 లక్షలు రికవరీ
● వివరాలు వెల్లడించిన చీరాల డీఎస్పీ మొయిన్

అద్దంకి: అంత రాష్ట్ర దొంగను పట్టుకొని పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. ఇటీవల అద్దంకి పట్టణంలోని పోతురాజు గండిలోని శ్రీసాయిరామ్ ఏజెన్సీస్ దుకాణంలో జరిగిన భారీ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో చీరాల డీఎస్పీ మొయిన్ విలేకర్ల సమావేశం నిర్వహించి కేసుల వివరాలు వెల్లడించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం అంకంపాలెం గ్రామానికి చెందిన సాయి సూర్యతేజ చిన్న వయసు నుంచే చిన్న చిన్న దొంగనాలు చేసేవాడు. చెడు వ్యవసనాలకు అలవాటుపడి గ్యారేజీల షట్టర్లు పగులగొట్టి దొంగతనాలు చేస్తుండేవాడు. సూర్యతేజ గుంటూరు నగరంలోని స్వర్ణభారతినగర్‌కు చెందిన బెల్లంకొండ విజయ్‌కృష్ణతో కలసి గత నెల 25వ తేదీ అద్దంకిలోని శ్రీరామ్ ఏజెన్సీలో రాత్రి సమయంలో షట్టర్ పగులగొట్టి గల్లా పెట్టెలో ఉన్న రూ.15.30 లక్షల నగదు చోరీ చేశాడు. దుకాణ యజమాని గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి నిందితుడిని అతి తక్కువ సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అతి తక్కువ సమయంలో నిందితుడిని అరెస్టు చేసి అతని వద్ద నుంచి అద్దంకితో పాటు వివిధ జిల్లాల్లో 8 కేసులకు సబంధించిన రూ.18.48 లక్షలు సొత్తు రికవరీ చేశారు. మంగళవారం అద్దంకి సమీపంలోని కొంగపాడు డొంక వద్ద నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

సిబ్బందికి రివార్డు

నిందితులను చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ మొయిన్, సీసీఎస్ డీఎస్పీ జగదీశ్ నాయక్, అద్దంకి సీఐ కృష్ణయ్య, సీసీఎస్ ఎస్సై ప్రేమయ్య, అద్దంకి, చీరాల ఎస్ఐలు ఖాదర్‌బాషా, కమలాకర్, జే పంగులూరు ఎస్సైతో పాటు పలు స్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సై బాజీ, బృందంలోని పోలీసులను ఎస్పీ తుషార్ డూడీ అభినందించి రివార్డు ప్రకటించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

పటిష్ట బందోబస్తు

పట్టణంలో నేరాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో సీసీఎస్ బృందాలతోపాటు పోలీసు బృందాలు గస్తీ తిరుగతూ అనుమానితుల ఇళ్ల సోదాలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు సహకరించి కొత్త వారు కనిపిస్తే పోలీసులకు తెలియజేయాలని డీఎస్పీ కోరారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతంలో
జెడ్పీటీసీలదీ కీలక పాత్ర

● కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలి
● పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు
● కార్యకర్తలు గర్వపడేలా సాగిన వైఎస్ జగన్ పాలన
● పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు. పక్కన మేరుగ, బొల్లా, గోపిరెడ్డి, మురళీకృష్ణ, డైమండ్‌బాబు తదితరులు

పట్నంబజారు: రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసే ప్రక్రియలో జెడ్పీటీసీలు కీలక పాత్ర పోషించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు చెప్పారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత ప్రజలతో మమేకమై వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. అదే సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని తీరును ఎండగట్టాలన్నారు. పార్టీ అధిష్టానం పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని జయప్రదం చేసే దిశగా ముందుకు సాగాలని పేర్కొన్నారు. జెడ్పీటీసీలు పార్టీకి కట్టుబడి ఉన్నారని, భవిష్యత్తులో సైతం కూటమి అక్రమాలపై ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

కార్యకర్తలకు అండగా పార్టీ

మాజీ మంత్రి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి భుజానికెత్తుకున్న జెండాను కిందకు దించకుండా పోరాడుతున్న ప్రతి కార్యకర్త సగర్వంగా తలెత్తుకునేలా పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పరిపాలన సాగిందన్నారు. వైఎస్ జగన్‌ను నమ్ముకున్న ప్రతి ఒక్కరికి ఉన్న అజెండా ఒక్కటేనని.. అది వైఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడటం అన్నారు. ఏ కార్యకర్తకు కష్టం వచ్చినా తాము వెన్నంటి ఉంటామని స్పష్టం చేశారు.

ముఖ్య నాయకులు ఏమన్నారంటే...

■ వినుకొండ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ... పార్టీ ఓటమి చవిచూసిన తరువాత కూడా ఏ మాత్రం వెరువకుండా పార్టీ పటిష్టత కోసం పాటుపడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.

■ నరసరావుపేట నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, సమన్వయకర్త గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. జెడ్పీటీసీలు రానున్న రోజుల్లో పార్టీ మండల అధ్యక్షులు, నాయకులు, గ్రామ నేతలతో సమన్వయంగా పనిచేయాలన్నారు. పార్టీని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాలని సూచించారు.

■ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ.. రాజకీయాల్లో ఒడిదొడుకులు సహజంగానే ఉంటాయని గుర్తుచేశారు. కానీ నమ్ముకున్న సిద్ధాంతాల కోసం, తమకు పదవి ఇచ్చిన నాయకుడి కోసం పోరాడుతున్న ఘనత జెడ్పీటీసీలకే దక్కుతుందన్నారు.

■ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, డిప్యూటీ మేయర్, పార్టీ గుంటూరు నగర అధ్యక్షుడు వనమా బాలవజ్రబాబు (డైమండ్‌బాబు) మాట్లాడుతూ.. ఎవరు ఎంత కష్టపడినా ప్రజలకు మంచి చేయటంతోపాటు మన భవిష్యత్తు కోసమేనన్న విషయాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, పార్టీ అధ్యాపక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉమ్మడి గుంటూరు జిల్లా జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

వైకల్యాన్ని అధిగమించిన వారికి చేయూతనిద్దాం

గుంటూరు ఎడ్యుకేషన్: శారీరక వైకల్యంతో కష్టాలను ఎదుర్కొంటూ వాటిని జయించిన వారికి చేయూత ఇద్దామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి.లీలావతి పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా రాజాగారితోటలోని నగరపాలక సంస్థ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ.. అందరికీ స్ఫూర్తినిస్తున్న విభిన్న ప్రతిభావంతులను గౌరవించి, సమాజంలో తోటివారిగా ఆదరించాలని పిలుపునిచ్చారు. గుంటూరు తూర్పు ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ విద్యార్థులకు అన్నివిధాలా ప్రభుత్వం సాయం చేస్తున్నట్లు చెప్పారు. విభిన్న ప్రతిభావంతురాలైన ఉపాధ్యాయురాలు పాదిలి మేరీ రాజేశ్వరిని సత్కరించారు.

కంకర కుప్పను ఢీకొని యువకుడి మృతి

ఒకరికి తీవ్రగాయాలు, మరో ఇద్దరికి స్వల్పగాయాలు

వేటపాలెం: రోడ్డుకు అడ్డుగా పోసిన కంకర కుప్పను బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు మృతి చెందగా, ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని పొట్టి సుబ్బయ్యపాలెం దగ్గరలోని క్రిస్టల్ విల్లాస్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకుంది. అందిన వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన నలుగురు యువకులు రెండు బైక్‌లపై పొట్టి స్బుయ్యపాలెం సముద్ర తీరానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో రాత్రి కావడంతో వేగంగా వస్తున్న బైక్ క్రిస్టల్ విల్లాస్ వద్ద రోడ్డుపై ఉన్న కంకర కుప్పను ఢీకొంది. బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులు ఎగిరి రోడ్డుపై పడ్డారు. ఇందులో యర్రవరపు కల్యాణ్‌రామ్ (20) అక్కడికక్కడే మృత్యువాత పడగా, కంచర్ల వెంకట మనోజ్ తీవ్రగాయాల పాలయ్యాడు. వీరి వెంటే వస్తున్న మరో బైక్‌పై ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రోడ్డుపై భవన నిర్మాణ మెటీరియల్ వేయడంతో రాత్రి వేళల్లో ద్విచక్రవానాలకు ప్రమాదకరంగా మారాయని ప్రజలు వాపోతున్నారు. రోడ్డు మధ్యలో భవన నిర్మాణ మెటీరియల్‌ని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు